పూర్తి కావొచ్చిన కేజీబీవీ భవనం

- చిన్న చిన్న పనులు మినహా అన్ని పనులు పూర్తి
- విద్యార్థులకు తీరనున్న కష్టాలు


కేజీబీవీ భవనానికి రంగులు వేస్తున్న కూలీలు

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో నాలుగున్నరేళ్లగా నిర్మిస్తున్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ(కేజీబీవీ) భవనం ఎట్టకేలకు పూర్తి కావచ్చింది. దీంతో విద్యార్థులకు అద్దె భవనంలోని అవస్థలు దూరం కానున్నాయి. 2017లో ముప్కాల్ మండల కేంద్రంలో నూతన కేజీబీవీని ప్రభుత్వం ప్రారంభించింది. అప్పటి నుంచి అద్దె భవనంలోనే కొనసాగుతోంది. 2021లో అప్పటి ప్రభుత్వం నూతన భవన నిర్మాణం కోసం రూ.3.5 కోట్లు మంజూరు చేసింది. అప్పటి నుంచి పనులు ఆగుతూ.. సాగుతూ కొనసాగాయి. కేజీబీవీ పాఠశాలలో 200 మంది విద్యార్థులు చదువుతున్నారు. నూతన భవనంలో ప్రహరీ , నల్లాల బిగింపు, బల్బుల బిగింపు, భవనానికి రంగులు వేయడం పూర్తయితే ప్రారంభానికి సిద్ధమైనట్లే. ఈ నెలాఖరు వరకు పనులు పూర్తి చేస్తామని అధికారులు అంటున్నారు. అంటే వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి భవనం సిద్ధంగా ఉంటుంది. పాలకులు స్పందించి పనులను వేగవంతం చేసి విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి భవనం ప్రారంభించి సిద్ధంగా ఉంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఐదేళ్లుగా నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తూ జిల్లాలోనే రెండవ స్థానంలో ముప్కాల్ కేజీబీవీ నిలిచింది. భవనం పూర్తయితే విద్యార్థులకు మరింత సౌకర్యవంతంగా మారుతుందని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

నెలాఖరు వరకు సిద్ధం చేస్తాం

ముప్కాల్ కేజీబీవీ భవనాన్ని ఈ నెలాఖరు వరకు పూర్తి చేస్తాం. ఫైనల్ పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. పనులు వేగంగా సాగుతున్నాయి. నూతన విద్యా సంవత్సరం నూతన భవనంలోనే ప్రారంభించుకునేలా చర్యలు తీసుకుంటున్నాం.

– మురళి, ఏఈ, నిజామాబాద్

ప్రశాంతంగా నీట్ పరీక్ష


పరీక్షా కేంద్రంలోనికి అనుమతించకపోవడంతో రోదిస్తున్న విద్యార్థిని

బోధన్‌టౌన్(బోధన్): పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన రెండు పరీక్షా కేంద్రాల్లో నీట్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా సాగింది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాల్లో 864 మంది విద్యార్థులు పరీక్ష దరఖాస్తు చేయగా, 842 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పరీక్ష నిర్వహించారు. పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేశారు. కేంద్రాల పరిధిలో పోలీసులు 144సెక్షన్ ఏర్పాటుచేసి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముగ్గురు విద్యార్థుల ఆలస్యం..

పరీక్షా సమయానికి ఆలస్యంగా వచ్చిన ముగ్గురు విద్యార్థులను నిర్వాహకులు అనుమతించకుండా గేటు మూసి వేశారు. దీంతో విద్యార్థులు ఎంత బతిమిలాడినా ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒక విద్యార్థిని ఆలస్యంగా వచ్చిన కారణంగా అనుమతికపోవడంతో కన్నీరు పెట్టుకొంది. నిర్వాహకులను, పోలీసులను బ్రతిమిలాడినా వారు లోనికి అనుమతించలేదు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రానికి ఇద్దరు విద్యార్థులు నిబంధనలకు విరుద్ధంగా ఆలస్యంగా రావడంతో నిర్వాహకులు లోనికి అనుమతించలేదు. వారు నిరాశకు గురై కన్నీరు పెట్టుకున్నారు.

అటకెక్కిన చలివేంద్రాలు

- జీపీల ఆధ్వర్యంలో చలివేంద్రాల ఏర్పాటు
- నెల రోజులు గడవక ముందే మూసివేత


ముప్కాల్ మండల కేంద్రంలో ఖాళీగా దర్శనమిస్తున్న చలివేంద్రం

బాల్కొండ: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చటానికి గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో చలి వేంద్రాలను ప్రారంభించారు. కాని నెల రోజులు గడవక ముందే అటకెక్కించారు. చలి వేంద్రాల్లో నీటి వసతి కోసం ఏర్పాటు చేసిన ఒక్క వస్తువు కూడా లేకుండా పోయాయి. అధికారులు అట్టహాసంగా ప్రారంభించారు కానీ వాటి నిర్వహణను మరిచారు. అధికారులకు కమీషన్లు వచ్చే పనులు మాత్రం దగ్గరుండి పట్టించుకుని చేపడుతారు...కానీ సేవా కార్యక్రమాల గురించి అంతగా పట్టించుకోరని స్థానికులు విమర్శిస్తున్నారు. కనీసం ఈ నెలాఖరు వరకు చలి వేంద్రాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం

వేల్పూర్: వేల్పూర్ మండల గ్రామాలలో ఈ నెల 5 నుంచి జూన్ 5 వరకు ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల ఏవో శృతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో క్లస్టర్ల వారీగా ఏఈవోలు గ్రామాలకు కేటాయించిన తేదీలలో రైతులకు చెందిన వ్యవసాయ భూముల వివరాలు ఆధార్‌కార్డుతో అనుసంధానం చేస్తారని వెల్లడించారు. రైతులు వారి భూముల వివరాలు ఏఈవోలకు తెలిపి ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని ఆమె పేర్కొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



నవీపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దేవేందర్ సింగ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీల కొరతతో రైస్ మిల్లులకు తరలించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తేమ శాతం సరిగ్గా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యంతో రైతులు వరి ధాన్యం కల్లాల వద్ద రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తున్నారని అన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించకపోతే వరుస ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు కిషన్, గంగాధర్ వడ్డెన్న తదితరులు పాల్గొన్నారు.

పదిలో ప్రతిభ.. విద్యార్థులకు సన్మానం



రుద్రూర్: పదవ తరగతిలో 500లకు పైగా మార్కులు సాధించిన కోటగిరి హైస్కూల్ విద్యార్థులను ఆదివారం పాఠశాల ఉపాధ్యాయ బృందం, పీఆర్‌టీయూ సభ్యులు ఘనంగా సన్మానించారు. కోటగిరి జెడ్పీహెచ్ఎస్‌లో ఏడుగురు విద్యార్థులను, వారి తల్లి దండ్రులను మెమోంటో, శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఎంఈవో నాదెండ్ల శ్రీనివాస్‌రావు, పీఆర్‌టీయూ కోటగిరి మండల అధ్యక్షుడు బర్ల సాయిలు, రాష్ట్ర ఉపాధ్యక్షులు అర్షద్, తదితరులున్నారు.

పహల్గాం బాధితులకు నివాళులు



ఆర్మూర్‌టౌన్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిలో అసువులు బాసిన అమరులకు పట్టణంలోని రాంనగర్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో విశేష సేవలందించిన పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్యకు నివాళులు అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. సంఘం 5వ తర్ఫ అధ్యక్షుడు సైబ సుధాకర్, సంఘం కార్యదర్శి కొండ గంగాధర్, కోశాధికారి క్యాతం లక్ష్మణ్, కట్కం నరేందర్, ఆడేపు ప్రభాకర్, చౌక లింగం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన 'శుక్రవారం దేవి' ఆలయంలో వి గ్రహ ప్రతిష్ఠాపన ఆదివారం ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదా నం చేపట్టారు. ఉత్సవాల్లో బాల్కొండ నియోజకవ ర్గ కాంగ్రెస్ ఇంచార్జి సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని చిన్నబజార్‌లో గల లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ఆర్మూర్ క్షత్రియ సమాజ్, యువజన సమాజ్ ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణమహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. వధూవరుల తరపున సమాజ్ అధ్యక్షుడు బచ్చేవార్ రెడ్డి ప్రకాష్ దంపతులు పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా జరిపించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు పురవీధుల్లో పల్లకీ సేవ నిర్వహించారు. పీసీసీ మాజీ కార్యదర్శి ఖాందేష్ శ్రీనివాస్, నాయకులు పండిత్ పవన్, క్షత్రియ సమాజ్, యువజన సభ్యులు తెలిపారు.

ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో వేగం పెంచాలి


మాట్లాడుతున్న దుద్దు గంగాధర్

మాక్లూర్: గ్రామాల్లో కొనసాగుతున్న ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేగంగా జరిపి, సంచులను త్వరగా రైస్‌మిల్లులకు తరలించేలా చర్యలు చేపట్టాలని అఖిల భారత రైతుకూలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుద్దు గంగాధర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఒడ్డేట్‌పల్లిలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం గంగాధర్ రైతులతో కలిసి మాట్లాడారు.నెల రోజుల క్రితం కాంటా అయిన వరి ధాన్యం ఇప్పటికి రైస్‌మిల్లుకు వెళ్లలేదని దీంతో రైతులు పడరాని పాట్లు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి చర్యలు చేపట్టాలన్నారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని అన్నారు.

రైతు ధర్నాను విజయవంతం చేయాలి



ఆర్మూర్‌టౌన్: అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయూకేఎస్) ఆధ్వర్యంలో మే 8న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో జరిగే రైతు ధర్నాను విజయవంతం చేయాలని ఏఐయూకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బి.దేవారం అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో నేతలు ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మభ్యపెడుతోందని విమర్శించారు. నాయకులు గంగారాం, రాజన్న, సాయన్న, ఠాకూర్, అరవింద్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయించండి


వినతిపత్రం అందజేస్తున్న పడగల్ వీడీసీ సభ్యులు

వేల్పూర్: పడగల్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయించాలని స్థానిక వీడీసీ సభ్యులు ఆదివారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పడగల్ నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీరాంపూర్ బైపాస్‌రోడ్డుకు, ఆదిమల్లన్న గుడి చుట్టూ సీసీరోడ్డు, మేడె చిన్న ఒర్రెకు పెద్ద బ్రిడ్జి నిర్మించాలని, కొత్తచెరువు తూము మరమ్మతు, వాటర్ ట్యాంకు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. వీడీసీ సభ్యులు గంగారెడ్డి, జక్కల రాజేశ్వర్, చండీ రాములు, రాజముత్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రమదానం



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని మహాలక్ష్మీ ఆలయ ఆవరణలో ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం 'స్వచ్ఛ ఆర్మూర్' కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం గంట పాటు స్వచ్ఛ ఆర్మూర్ నినాదంతో శ్రమదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. చెత్త, పిచ్చిమొక్కలు తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి



కమ్మర్‌పల్లి: హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ఆదివారం అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలు తీసుకువచ్చి రైతుల నడ్డి విరుస్తోందని విమర్శించారు. నేతలు పెద్ది రాజేశ్వర్, మౌలానా, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీ అమలు చేయాలి



రుద్రూర్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. కోటగిరిలో ఆదివారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేసినప్పటికీ రూ. 2 లక్షల పైబడి ఉన్న వారికి రుణమాఫీ కాలేదని అన్నారు. రైతుకు బోనస్ ఇవ్వడం మంచి నిర్ణయమని అన్నారు. సీపీఐ మండల కార్యదర్శి విఠల్ గౌడ్, నాయకులు బర్ల సునీల్ కుమార్, శివరాజ్, పండరి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండలాల అధ్యక్షుల నియామకం


సిర్ప సుదర్శన్, బోధన్ | అంబటి నవీన్, బాల్కొండ | సంతోష్‌రెడ్డి, ముప్కాల్ | ముత్యంరెడ్డి, మెండోరా | ఆర్. గంగాధర్, సాలూర | గోపి కిషన్, బోధన్ పట్టణం

బోధన్‌రూరల్/బాల్కొండ/బోధన్‌టౌన్/సుభాష్‌నగర్: జిల్లాలో ని పలు మండలాలకు అధ్యక్షులను బీజేపీ నియమించింది. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినే ష్ కులాచారి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. బోధన్ మండల బీజేపీ అధ్యక్షుడిగా సిర్ప సుదర్శన్(అమ్దాపూర్), బోధన్ పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా పసులోటి గోపి కిషన్, సాలురా మండల బీ జేపీ అధ్యక్షుడిగా రావుబా గంగాధర్(మందర్న), ముప్కాల్ మండల బీజేపీ అధ్యక్షుడిగా గడ్డం సంతోష్ రెడ్డి, మెండోరా మండల అధ్యక్షుడిగా మార ముత్యంరెడ్డి(బుస్సాపూర్), బాల్కొండ మండల బీజేపీ అధ్యక్షుడిగా అంబటి నవీన్, నవీపేటకు ద్యాగసరిన్, మోర్తాడ్‌కు శివానంద్, కమ్మర్‌పల్లికి బద్దం రమేశ్‌రెడ్డి, భీంగల్‌కు ఆరె రవీందర్, వేల్పూర్‌కు బేల్దారి నవీన్, ఏర్గట్లకు ఎస్.గంగాధర్‌లను అధ్యక్షులుగా నియమించారు. నియామకానికి సహకరించిన బీజేపీ ఎంపీ అర్వింద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డి మోహన్ రెడ్డి, మేడపాటి ప్రకాశ్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

రుద్రూర్: అంబం(ఆర్) శివారులో గల మోడల్ స్కూల్/కాలేజీలో ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చెన్నప్ప తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఆంగ్ల మాధ్యమంలో సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 5 నుంచి 20వ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన విద్యార్థుల జాబితాను ఈ నెల 26న ప్రకటిస్తామన్నారు. 27 నుంచి 31 వరకు ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దేశీ కోళ్ల పెంపకం ఎంతోబాగు..!


పాశపు సాయన్న

బాల్కొండ: ముప్కాల్ మండలం వెంచిర్యాల్ గ్రామానికి చెందిన రైతు పాశపు సాయన్న.. సోనాలి దేశీ కోళ్ల పెంపకం ఎంతో బాగుందని అంటున్నాడు. మూడు నెలల నుంచి కోళ్లను పెంచుతున్న ఆయన.. ఆదాయంపై వివరణ ఇచ్చారు.. వ్యవసాయంలో సంప్రదాయ పంటలు సాగు చేయడం వల్ల ధర దక్కక అనేక నష్టాలు చూస్తున్నాం. దీంతో ప్రత్యామ్నాయంగా కోళ్లను పెంచాలని నిర్ణయించుకున్నాను. అలా అనుకుని హైదరాబాద్ నుంచి మూడు నెలల క్రితం ఒక్క రోజు వయస్సు గల సోనాలి దేశీ కోడి పిల్లలు(500) రూ.32 చొప్పున కొనుగోలు చేశాను. గ్రామంలో ఓ షెడ్డులో వాటి పెంపకం ప్రారంభించాను. వాటి పెంపకం కోసం దాణాను 50 కిలోల బస్తా రూ.1800లకు కొనుగోలు చేశాను. ఇలా వారానికి 50 కేజీల బస్తాను దాణాగా వేశాను. ప్రస్తుతం మూడు నెలల్లో ఒక్కో కోడి పిల్ల కిలో నుంచి కిలో పావు వరకు బరువు పెరిగాయి. ముందు తెచ్చినవి ఎదుగుతుండగానే మరో వెయ్యి పిల్లలను కొనుగోలు చేశాను. బరువు పెరిగిన వాటిని కిలో రూ.350 చొప్పున విక్రయిస్తున్నాను. నెలలో రోజుకు సగటున 5 కిలోల కోళ్లను విక్రయిస్తున్నాను. దీంతో రూ.1,750 ఆదాయం వస్తోంది. ప్రధానంగా దాబా హోటళ్లలో ఈ కోళ్లకు డిమాండ్ ఉంది. ప్రస్తుతం దాణా కరీంనగర్ నుంచి 50 కేజీల బస్తాను రూ.1400కే దిగుమతి చేసుకుంటున్నాం. సోనాలి దేశీ కోళ్లకు రోగాలు వచ్చే అవకాశం తక్కువ. ప్రభుత్వం కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహించాలి. ప్రభుత్వం నుంచి రుణం కోసం దరఖాస్తు సుకున్నాం. వెంటనే ఇప్పించాలని కోరుతున్నాం.

పరికరాలు ఇలా.. పిల్లలు ఆడుకునేదెలా?


హౌసింగ్‌బోర్డు పార్కులో విరిగిపోయిన ఆట వస్తువులు.. ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ కోసం తవ్విన గుంతలు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఉన్న పార్కు అధ్వానంగా తయారైంది. పార్కులోని ఆటవస్తువులు విరిగిపోయి ఉండటంతో చిన్నారులు ఆడుకునేందుకు వీలు లేకుండా పోయింది. దీంతో ఆడుకుందామని ఆశగా వచ్చిన చిన్నారులు నిరాశతో వెనుతిరుగుతున్నారు. ఇటీవలే పార్కులో అమృత్ 2.0 పథకంలో భాగంగా వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపడుతున్నారు. దీనిలో భాగంగా కొన్ని ఆట వస్తువులను సంబంధింత అధికారులు తొలగించారు. దీంతో చిన్నారులు ఆటలకు దూరమ్యారు. ఉన్న కొద్దిపాటి స్థలంలో ట్యాంకు నిర్మాణం వల్ల పిల్లలు ఆడుకునేందుకు స్థలం కరువైంది. కాలనీవాసులు సైతం పార్కులో వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టవద్దని మున్సిపల్ అధికారులను కోరారు. అధికారులు స్పందించి చెడిపోయిన ఆటవస్తువుల స్థానంలో నూతన ఆట వస్తువులు ఏర్పాటు చేసి పిల్లలు ఆడుకునే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

సిరికొండ: అప్రమత్తతోనే విద్యుత్ ప్రమాదాలను నివారించవచ్చని డిచ్‌పల్లి ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో విద్యుత్ భద్రతా వారోత్సవాలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ.. సిబ్బంది విధుల్లో భద్రతా నియమాలు పాటించి సంస్థను జీరో ప్రమాదాల స్థాయికి తీసుకురావాలన్నారు. సొంతంగా మరమ్మతులు చేపట్టవద్దన్నారు.

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1	రైడ్-2(హిందీ)-10.00, 1.00, 7.25, 10.25, రెట్రో-4.00
స్క్రీన్-2	హిట్-12.30, 3.45, 7.00, 10.15
స్క్రీన్-3	రెట్రో-11.30, 2.55, 6.20, 9.45
స్క్రీన్-4	హిట్-11.30, 2.45, 6.00, 9.15

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	190
		లైవ్	160
స్కిన్‌లెస్	220	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,200	వెండి(కిలో)	1,00,000
22 క్యారెట్స్	89,725		

– నిజామాబాద్ బిజినెస్

చదివింది బీటెక్.. చేస్తుంది వంట!

- సొంత బిజినెస్‌పై మక్కువతో..
- ఆర్డర్ మెస్ నిర్వహిస్తున్న బీటెక్ పూర్తి చేసిన విద్యార్థి


వంట చేస్తున్న వంశీ కృష్ణ

బాల్కొండ: ఉద్యోగంపై ఆధార పడకుండా, సొంతంగా బిజినెస్ చేసుకుంటూ జీవనం సాగించాలని నిర్ణయించుకుని బీటెక్ పూర్తి చేసిన బాల్కొండ మండల కేంద్రానికి చెందిన చిక్యాల వంశీ కృష్ణ ఆర్డర్ మెస్ పెట్టుకుని వంటలు చేస్తూ ఆదాయాన్ని ఆర్జిస్తున్నాడు. ముప్కాల్ మండల కేంద్రంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేసి, ఇంటర్ విజయసాయి కళాశాల(బోధన్)లో పూర్తి చేశాడు. బీటెక్ కామారెడ్డిలో 2010లో పూర్తి చేశాడు. పలు ప్రయివేటు కంపెనీల్లో ఉద్యోగం చేశాడు. కాని సంతృప్తి లేకపోవడంతో ఉద్యోగం మానేశాడు. 2020లో బాల్కొండ మండల కేంద్రంలో ఆర్డర్ మెస్ ప్రారంభించాడు. ఆర్డర్ మెస్‌లో చికెన్, మటన్, శాఖాహార వంటలు చేస్తూ ఆదాయన్ని సంపాదించుకుంటున్నాడు. మెస్‌లో స్వయంగా వంటలు చేస్తూ, వినియోగదారులకు సర్వీస్ చేస్తున్నాడు. ఇతర పనులకు ఇద్దరు వర్కర్లను పెట్టుకున్నాడు. నెలకు రూ.80 వేల నెంచి లక్ష వరకు సంపాదిస్తున్నట్లు చెబుతున్నాడు. పెద్ద చదువులు చదివినా ఎలాంటి సిగ్గు పడకుండా సొంత బిజినెస్ చేయాలనే కాంక్షతో వంశీ కృష్ణ ముందుకు సాగుతున్నాడు. వంశీ కృష్ణ భార్య మౌనిక విజయ్ రూరల్ ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఉద్యోగాలు రావడం లేదంటూ నిరాశ పడుతున్న ఎందరో యువకులకు వంశీ కృష్ణ ఆదర్శంగా నిలుస్తున్నారు.

నృత్య పోటీలలో కమ్మర్‌పల్లి కళాకారిణుల ప్రతిభ

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పరమేశ్వర కళానిలయంలో శిక్షణ పొందుతున్న కళాకారిణులు ఆదివారం యాదగిరిగుట్టలో నిర్వహించిన నృత్య పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు నాట్య గురువు గంట శిరీష తెలిపారు. తమ కళా నిలయానికి చెందిన సుదీక్ష, భువనేశ్వరి, నమ్రత, లరణ్య, భవ్యశ్రీ, రిషిత, చైత్ర, మిథిలాదేవి, మధుశ్రీ, రిషిప్రియ, శివాణి, వన్షిక, మనస్విని, శ్రీలాస్య, అక్షర పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు యాదగిరి లక్ష్మీనృసింహ అవార్డుతో పాటు ప్రసంసాపత్రం అందజేసినట్లు తెలిపారు.


జ్ఞాపికలతో కమ్మర్‌పల్లి కళాకారిణులు